

# పంచ కన్యలు

డా॥ వి.బి.బి. రామారావు

కమలాకర్‌కి గుండెలు దడదడలాడాయి.

తనే పొరబడ్డాడా? చూడడం సరిగానే చూశాడే! నంబర్ సెవెన్ తనది. ఎందుకయినా మంచిదని టిక్కెట్టు జేబులో నుంచి తీసి చార్ట్ దగ్గరకు వెళ్లాడు. తన పేరేడు చే. తన టిక్కెట్టు నంబరుంది. సెవెన్. మరి ఆడవాళ్ల 'బే'లో ఉంది. ఆడా మగా తేడా రైల్వే దృష్టిలో పోయిందేమో! లోపలకివెళ్లి తన బ్రీఫ్ కేస్ తన క్యారియర్ వగైరా లోపలపెట్టి సామాను ఎవరూ దింపుకుని పోకుండా గేటు దగ్గరే నిలబడ్డాడు.

—కండక్టర్ బోగీ దగ్గరకు రాగానే టిక్కెట్లు తీసి చూపించాడు. "నంబర్

పెవెన్ సార్!"

"మరి లేడీస్ బేలో ఇచ్చారేం?"

"అదేం లేదు సార్. మీరు పెవెన్ అక్యుపై చెయ్యండి."

—రైలు కదలడానికి ఇంకా ఓ ఐదు నిముషాలుంది. బిలబిలా ఆడపిల్లలో పదిమంది ఛార్ట్ దగ్గరకొచ్చారు. నంబర్లు వెదికారు.... అంతా లేడీస్ బేలో దూరబడ్డారు.

"నమస్కారం సార్!" అంది ఏం చెయ్యాలో తోచక బే ప్రాంతంలో తచ్చాడుతున్న కమలాకర్‌తో ఓ అమ్మాయి. బొద్దుగా, ఎర్రగా, బంతి పువ్వులా ఉంది.

"నమస్తే! మీరు... రాజా మరదలు కదూ!"

"కాదండీ! మీరు....మా కాలేజీలో .. పొదుపు గురించి మాటాడడానికి వచ్చారు కదూ! మా ప్రిన్సిపాల్‌గారు..."

"అవునవును!" ఆ అమ్మాయి ఇంకే మంటుందోనని కమలాకర్ చాలా కంగారు పడిపోయాడు. అతని ముఖం ఎర్రగా అయిపోయింది. తను తరచు కాలేజీకి వెళ్ళతాడు... సుశీల గురించి... అదే వాళ్ళ ప్రిన్సిపాల్ గురించి వీళ్ళకి... కమలాకర్ దూరంగా వెళ్ళాడు.

"నమస్కారం సార్!" ప్లాట్‌ఫారమ్ మీద ఒకతను.

"నువ్వెవరు బాబూ!"

"ప్రిన్సిపాల్ ఆఫీసులో ఎటెండర్ని.. మీరు అమ్మగారి కోసం..."

"ఆఁ!... ఎవరీ అమ్మాయిలంతా?"

"క్యాంపుకు వెళుతున్నారు బాబూ! హైదరాబాదు..."

"ఇలా లెక్చరర్ ఎవరినీ సాయం లేకుండా పంపిస్తున్నారా మీ అమ్మగారు..."

"బాబూ తమకి తెలియందేముంది? ఫండ్స్... ఫండ్స్ లేవట... నన్ను స్టేషన్ వరకూ దిగబెట్టిరమ్మన్నారు..."

కమలాకర్‌కి ధైర్యం వచ్చింది.

"సుశీలతో చెప్పు... అమ్మాయిల్ని నే చూసుకుంటాలే... అయినా బాధ్యత గల మనిషినెవరినీ సాయం పంపకుండా ఈ రోజుల్లో ఆడపిల్లల్ని... సరే నే చూసుకుంటాలే... అవతల ప్లాట్‌ఫారం మీద మన ఊరికి రైలుంది. నువ్వెళ్ళు.."

"థాంక్స్ సార్! వాళ్ళతో ఓ మారు చెప్పి వెళతా!" రైలు కదలకుండానే ఎటెండర్ వెళ్ళిపోయాడు.

మరికొద్దిసేపట్లో రైలు బయలుదేరింది. రాత్రి తొమ్మిదవుతుండగా అప్పటివరకూ మూర్తి పక్కనున్న కమలాకర్ లేచాడు.

మునిముసి నవ్వులు నవ్వుతూ మూర్తి "తలుపులు జాగ్రత్త!" అంటూ కమలాకర్‌తో చమత్కరించాడు.

ఐదుగురు కన్యలు మధ్య అవివాహితుడు- కమలాకర్ గుండెలో గుబులు-

చేస్తున్నది పెద్ద ఉద్యోగం. బాధ్యత బరువు. పైగా ఆ ఆడపిల్లలందరికీ తనకీ సుశీలకి మధ్య ఉన్న స్నేహం తెలుసు.

పంచకన్యలలోనూ ఏ ఒక్కరైనా కెవ్వున కేకవేసి తనమీద అత్యాచారం చేశాడన్న అభాండం వేస్తే?

అది సుశీల వరకూ వెళితే?

గుండె దడదడ లాడింది.

స్లయిడింగ్ డోరు తెరిచేముందు అద్దంలోనుంచి లోపలకి చూశాడు.

ఓ అమ్మాయి పెదాలకు రంగు రాసుకుంటోంది

ఓ అమ్మాయి మరొకామె ఒడిలో తలపెట్టుకుని డైరీ చూసి ఏదో పాట పాడుతోంది.

తన బెర్తు దగ్గరకు వెళ్ళాలా, వద్దా?

నాకేం ఉద్యోగస్తుడ్ని. ఐదుగురు ఆడపిల్లల మధ్య పడుకోమని రైల్వే వాళ్ళు నాకు చోటు అక్కడ చూపించారు.

వీళ్ళ ప్రిన్సిపాల్ తన స్నేహితురాలై ఉండగా వీళ్ళ దగ్గర తనకు భయమెందుకు!

తలుపుమీద ఒకసారి టాప్‌చేసి స్లయిడింగ్ డోర్ పక్కకునెట్టి లోపలకెళ్ళాడు.

లిప్‌స్టిక్ అమ్మాయి కంగారుగా హ్యాండ్‌బ్యాగ్ తెరచి చేతిలోని స్టిక్ దాచేసింది.

పడుకున్న అమ్మాయి లేచి కూచుంది.

"మీరు... మీరు భోజనం అవీ..."

అందరినీ ఉద్దేశించే అన్నాడు కమలాకర్.

"భోజనం రైల్లోకి తెప్పించుకుందామే! నాన్‌వెజ్ దొరుకుతుందిగా..." అంది ఓ అమ్మాయి.

"నీళ్ళో? అరెరె! బకెట్లూ, మగ్గులూ ఉన్నాయి. కాని నీళ్ళు తెచ్చుకోడం మరిచిపోయాం!

"పారలూ, గునపాలూ, బొరిగెలూ తెచ్చాం... గమేలా లయితే జ్ఞాపకం ఉన్నాయి కాని బొత్తిగా మంచినీళ్ళే మరిచిపోయాం సుమా!"

ఒకరూ ఒకరూ అంటుంటే కమలాకర్ అన్నాడు. "నా బాటిల్‌లో నీళ్ళున్నాయి... కావలిస్తే..."

—కమలాకర్‌కి క్యారియర్ తియ్యడానికి మొగమాటం వేసింది.

ఆకలి నకనకలాడుతోంది. వెధవ రైలు. కూచోగానే ఆకలి... నిద్ర... వాళ్ళ మధ్యనుంచి క్యారియర్ తీసుకుని బయటకు వెళ్ళిపోతే!

కొంచెం ధైర్యంచేశాడు. ధైర్యం తనది కాదు ఆకలిది. "నేను బయటకు వెళ్ళి భోజనంచేసి వస్తా!" క్యారియర్‌తో బయటపడ్డాడు.

క్యారియర్ ఖాళీచేసి కడిగేసి లోపలకు తీసుకొచ్చాడు.

"నే సిగరెట్టు కాల్చనులెండి! మీకు ఇబ్బందేమో!" ఆడపిల్లలు ఏవేవో గుసగుసలు. ముసిముసి నవ్వులు. తను లోపలకు రాగానే గప్‌చుప్.

"మీకు అభ్యంతరం లేకపోతే నేను మీద పడుకుంటా!"

"అబ్బే! మా కెందుకండీ అభ్యంతరం... మీ దెలానూ సెవెన్-మీదనే కదా..."

పళ్ళు బిగబట్టి నవ్వు ఆపుకుంటున్నారు ముఖ్యంగా ఇద్దరమ్మాయిలు.

"మీకు... ఏమండీ మీకు..."

"ఏమిటే ఆ సణుగుడు? ఆయనకు ఏమిటే?" మరో అమ్మాయి ప్రాంప్ట్ చేసింది.

"ఏంలేదులేవే... సారీ సర్. మీరు మీదకే వెళ్ళిపోండి! ఈ రాక్షసులకు నిద్ర రాదు. ఏదో వాగుతూ ఉంటారు. ఇల్లుకదిలి ఎరగరేమో మహా హుషారుగా ఉన్నారు. మరేమీ అనుకోకండి!" పెద్దమనిషి తరహాగా ఉన్న అమ్మాయి అనేసి సీటు వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుంది.

వాళ్ళని బొత్తిగా చిన్నపిల్లలుగా ట్రీట్ చేసి ఇగ్నోర్ చెయ్యడం ఆ క్షణంలో తనకి తోచిన ఒకే ఒక మార్గం.

—మీద కెళ్ళి తలగడలో గాలి ఊదుకుని పడుకున్నాడు కమలాకర్.

కళ్ళయితే మూసుకున్నాడు కాని కంటిమీదకి కునుకు రావడంలేదు. రైలు చూస్తే వచ్చే నిద్ర- ఈ రోజు ఏమిటీ వింత?

వాళ్ళ థ్రిల్ చూసి తనకూ మతి పోయిందా? తను అసలు ఎందుకు బాధ్యత తీసుకున్నట్టు? వాళ్ళెవరో తనకు తెలియదు. వాళ్ళెలాపోతే తనకేం?

అలాగని ఊరుకోలేకపోతున్నాడేం?

"—అమ్మాయ్!" మీదనుంచి ఓ అమ్మాయిని పిలిచి "గొలుసులూ అవీ జాగ్రత్త! చెయిన్ స్నాచింగ్ చాలా జోరు ఈ సెక్షన్‌లో... అసలు మీరు బయటకు వెళ్ళవద్దు...ఏమైనా కావలిస్తే నే తెచ్చి ఇస్తా... డోర్ లాక్ చేసెయ్యండి."

"పడుకోండి సార్! మీకేం భయం లేదు!" దుబ్బుగా ఉన్న అమ్మాయి అంది!

ఎందుకో ఆ అమ్మాయంటే ఇంత వయసున్న కమలాకర్‌కే కొంచెం భయంలాంటిది కలిగింది.

కమలాకర్‌కి ఎప్పుడు నిద్ర పట్టిందో...

రైలు స్టేషన్‌లో ఆగి ఉంది;

—"మీకు పాటలు వచ్చా?" ఓ పురుష కంఠం.

"నే విన్నా... రాణీగారు చాలా బాగా పాడతారు. ఓ చిన్నపాట... సెలక్షన్ మీ ఇష్టమే..." మరొక మగగొంతు.

ఐదుగురు ఆడపిల్లలూ ఒకే బెర్త్ మీద కూచున్నారు.

తను పడుకున్న బెర్త్ క్రింద సీటులో ఇద్దరు స్టూడెంట్స్.

ఎవరు వీళ్ళు? ఇంత తొందరగా వీళ్ళతో స్నేహం ఎలా కుదిరింది?

ముందే ప్లాన్ వేసుకొని అంతా కలిసే బయల్దేరారా? రోజులు మారిపోయాయి.

అరిటాకు ముల్లుమీద పడ్డా - ముల్లు అరిటాకుమీద పడ్డా ఎప్పుడయినా చిరిగి పోయేది అరిటాకే.

"మీరు బి.ఈడీ కాలేజీలో ఉన్నారు కదూ!" ఓ అమ్మాయి అడిగింది.

"ఆఁ!... స్వాతంత్ర్యం వచ్చినా బానిసత్వం మిగిలిపోయిన జేబులు ఈ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలే. వాళ్ళయితే పకపకలూ పికపికలూ - మేం ఎవరితోనైనా మాట్లాడితే కళ్ళెర్రచేసి పరీక్షకన్నంపెట్టేయంటారు ... సగం అయింది లెండి! కాలేజీ బయటకొచ్చాక చూడు నాసామిరంగా గోడల కెక్కిం చేస్తే... ఒక్క వెధవకీ పొట్ట చీల్చితే అక్షరంముక్క రాదు...పైగా బడాయి... గొప్ప... పోజు... గీర..."

"అబ్బ ఊరోక్కరా! సుఖంగా ఉన్న సమయంలో ఈ గొడవెందుకు!"

—కమలాకర్ వాళ్ళ సుఖం అంతటితో ముగిస్తే మంచిదనిపించింది.

—"తరువాత స్టేషన్ ఏమిటీ?"

"అబ్బ! ఉండవే... నీ సొద నీది.. టైమ్‌టేబిల్ ఒకటి కొని స్టేషన్ల వాటి తాలో రేపు తేలికగా ఎక్కించుకో?" ఓ అమ్మాయి విసుక్కుంది.

ఇంతలో అబ్బాయి ఏం జోక్ వేశాడో ఏమో ఒకరిమీద ఒకరు పడి నవ్వుతుంటున్నారు.

సిగరెట్టు పొగ గుప్పుమంటోంది.

మరి కమలాకర్‌కి ఉండబట్టడంలేదు.

"రజనీగారు- అగ్గిపుల్లలతో ఓ ఆట చూపిస్తా..." పుల్లలు పేర్చి చూపిస్తున్నాడా అబ్బాయి.

మరొక జోక్ పేలిందేమో అందరూ గొల్లుమని నవ్వారు.

ఒకమ్మాయి తను కదలడం గమనించిందేమో "ష్" అంది.

స్లయిడింగ్ డోరు తెరచుకుంది.

—కమలాకర్ క్రిందకి దిగాడు.

సీటు వెనక్కి జేరగిలబడి కునికిపాట్లు పడుతుందో అమ్మాయి.

ఓ అమ్మాయి కిటికీలోంచి వెన్నెల్ని చూస్తోంది. చెక్కిలికి చెయ్యిచేర్చి మరీ.

కమలాకర్ బయటకి వచ్చాడు.

ఒకమ్మాయి గేటు దగ్గర నుంచుంది.

"జాగ్రత్త అమ్మాయ్!" అనకుండా వుండలేకపోయాడు కమలాకర్.

మరో ఇద్దరు అమ్మాయిలు ఏమైనట్టు? ఏమయితే తనకేం?

అలాగని చూజూస్తూ ఒంటరిగా వెళుతున్న ఆడపిల్లల్ని అలా గాలికి వదిలెయ్యడం...అందునా ఆ మగపిల్లలు ఎలాంటివాళ్లో ఏమో!

"అమ్మాయ్! ఆ ఇద్దరూ ఏరి?"

"తెలియదండీ! వెస్టిబ్యులర్ కదా... మరో పెట్టెలోకి వెళ్లి ఉంటారు... మా అన్నయ్య బెజవాడలో స్టేషన్‌కు వస్తానన్నాడు. అందుకని నే మేలుకుని ఇలా నుంచున్నా!..." ఆ అమ్మాయి చెప్పింది. ఎందుకో ఏమో అనుమానం కలుగుతుంది

వీళ్లందరిమీదా? నిజంగా వీళ్లు...

కమలాకర్‌కి ఈ కన్యలందరినీ తెల్లారేవరకూ ఎలా చూసుకోవాలా అనిపించింది.

లోపలకెళ్లి ఖాళీ సీటుమీద కూల బడ్డాడు.

"అమ్మాయ్! నీ పేరేమిటి?"

"రజని"- చందమామ నుంచి కళ్ళు తిప్పకుండానే జవాబు చెప్పింది ఆ అమ్మాయి.

"మరి బయటకు వెళ్లినవాళ్లు...?"

"రాజ్యలక్ష్మి... ప్రమీల... మేరీ..."

"వాళ్లన్నయ్య కోసం చూస్తున్న అమ్మాయి...?"

"మేరీ!"

"అలాగా!"

కమలాకర్‌కు మీదకు వెళ్లి నిద్ర పోవాలనిపించలేదు... జరగకూడనిది జరగకుండానే జాగ్రత్త పడడం మంచిది, చెప్పులు తొడుక్కుని లేచాడు కమలాకర్.

—"రాజ్యలక్ష్మి!"

చటుక్కున అబ్బాయి చెయ్యి విదిలించుకుని దూరంగా జరిగి నుంచుంది అమ్మాయి.

"ఈ అమ్మాయి పేరు ప్రమీల... మీరు ఎవరిని చూసి ఎవరనుకున్నారు!" అబ్బాయి బుసకొట్టాడు.

"రాజ్యలక్ష్మి అటు వెళ్ళిందండీ!" ప్రమీల అంది.

ఆ అమ్మాయి చొరవకీ ధైర్యానికీ కమలాకర్ ఆశ్చర్యపోయాడు.

"నీ పేరు బాబూ!"

"మైండ్ యువర్ బిజినెస్! అర్ధరాత్రి వేళ నా పేరు కావాల్సిరావడం చిత్రం! ఏం రాజీ!" మళ్లీ ఆ అమ్మాయి చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు అబ్బాయి.

"ఏయ్!..." రాజ్యలక్ష్మి అబ్బాయిని అందంగా వారిస్తూ ఉంటే కమలాకర్ 'బి' కోచ్‌వైపు నడిచాడు తూలుతూ.

—లావెట్రీదగ్గర మంచి పసందయిన ఘట్టంలో ఉన్నారు రెండవ జంట. మొదటి జంట కంటె ఫాస్ట్‌గా ఉంది వ్యవహారం.

కమలాకర్ గొంతు సవరించుకున్నా ఇద్దరూ వేరయ్యే స్థితిలో లేరు.

రైలు మంచి జోరుగా పోతోంది. ఎవరి బెర్తులమీద వాళ్లు హాయిగా నిద్ర పోతున్నారు.

—ప్రయాణం ప్రారంభమై సొంతం ఆరుగంటలు కాలేదు... అప్పుడే ఇద్దరమ్మాయిలు ప్రేమాయణం ప్రారంభం చేశారు. రైల్లో... ఇంత ఇదిగా...

దీనికి కారణం...

బందిఖానాలోంచి- విశృంఖలమైన విశాల ప్రపంచంలోకి - అంకుశంలేని సర్వస్వతంత్రంలోకి రావడమేనా?

"రాజ్యలక్ష్మి!"

"ఎవరూ?" అతని మెడచుట్టూ వేసిన చేతులు తియ్యకుండానే వచ్చింది జవాబు.

"నేనమ్మా!" కమలాకర్ ఉద్వేగంతో అన్నాడు.

"ఎవరండీ మీరు? మాతో మీకేం పని? మీకు సిగ్గులేదూ? మగాళ్ళు కదా! ఇలా మేం ఉన్నప్పుడు పలకరించడం మనిషి లక్షణమే! చదువుకున్నవాళ్ళేమో కదూ!"

ఆ అమ్మాయి ఛడామడా అనేసింది.

"సారీ డియర్!" ఆ అబ్బాయి చేతులు విడిపించుకున్నాడు.

"ఉండు విజయ్! ఇదెక్కడి గోల... తలవక తలవక కలిశాం... ఇదెక్కడి బాధ!"

—అవాక్కయిపోయిన కమలాకర్ తలదించుకుని తన సీటులోకి వచ్చాడు.

చందమామవంక ఆ అమ్మాయి కన్నార్పకుండా చూస్తోంది.

"చూడమ్మాయ్... నీ అన్నలాంటి వాడిని... నీ స్నేహితులిద్దరికీ ఆ అబ్బాయిల్ని ఎన్నాళ్ళనుంచి తెలుసు?"

"నన్నడుగుతారేం? వాళ్ళు పొమ్మన్నారా? మీ పని మీరు చూసుకోండి! ఈ వెన్నెల రేపు వుండదు.

కమలాకర్ ఖంగుతిన్నాడు.

—ఉదయం కాజీపేటలో తెలివి వచ్చింది. కింద ముగ్గురమ్మాయిలే ఉన్నారు.

—ఇది ఇలా జరుగుతుందనే నేమో సుశీల ఎవరినీ తోడు పంపలేదు.

ఎవరికి ఎవరు కాపలా?

సుశీల ఏమనుకుంటోందో? ఆమె కూడా వెన్నెలకోసమే ఆలోచిస్తోందా?

కమలాకర్ మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

